



విజ్ఞాన వెలుగులు

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవాన్ని పురస్కరించుకుని పుస్తక ప్రియులు సోమవారం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదన్నారు. ఈ పాదయాత్రలో పుస్తక ప్రియులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న మంత్రి దుర్గేష్, రాజకీయ నేతలు, విద్యావేత్తలు

6లో

ప్రొటోకాల్ పంచాయితీ!



నిబంధనలకు విరుద్ధంగా దర్శనాలు
ప్రొటోకాల్ కానిస్టేబుళ్ల దందా

- తమకు ఆ విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ విభాగాల పోలీసుల పట్టు
- పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం



8లో

- తోట్లవల్లూరులో శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీస్ యజమాని దండ భాస్కరరావు, ఆయన భార్య, కోడలుకు వరద నష్టపరిహారం అందింది. కానీ, వారు ఏ పంట పండించలేదు. వరద వల్ల నష్టపోయిందీ లేదు. అయినా వారికి పరిహారం అందింది. ఇదేంటని భాస్కరరావును ప్రశ్నించగా, వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావును అడగాలంటూ సమాధానమిచ్చారు.

- నందిని ఎంటర్‌ప్రైజెస్ యజమాని దొండపాటి శివరామకృష్ణకు పసుపు సాగు చేసినట్టుగా రూ.27,615, అరటి సాగు చేసినట్టుగా రూ.20,545, ఆయన భార్య అనూష అరటి సాగు చేసినట్టుగా రూ.20,825, వీరి దుకాణంలో పని చేసే వర్కర్ శ్రీకాకుళం కుసుమకుమారి అరటి సాగు చేసినట్టుగా రూ.20,545, ఈమె తల్లి కొల్లిపర శివసామ్రాజ్యం అరటి సాగు చేసినట్టుగా రూ.20,885 చొప్పున నష్టపరిహారం అందింది. దీనిపై శివరామకృష్ణను వివరణ కోరగా, తమ దుకాణంలో పురుగు మందులను రైతులు అప్పుగా తీసుకెళ్లి చెల్లించట్లేదని, నష్టపరిహారం వస్తుందని తెలిసి రైతులను అడగ్గా, ఆధార్ కార్డులు ఇవ్వమన్నారని, అలా తమకు డబ్బులొచ్చాయని చెప్పారు.

- ఆర్‌ఎస్‌కేలోని వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) తన తమ్ముడికి, కుటుంబ సభ్యులకు భారీగా పరిహారం ఇప్పించినట్టు వరద బాధిత రైతుల జాబితా చూస్తేనే తెలుస్తోంది.

.. ఇలా కృష్ణానది వరద నష్టపరిహారాన్ని పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. పంట నష్టపోయిన రైతులను పక్కనపెట్టి, తమ కుటుంబ సభ్యులు, బంధువుల ఖాతాలకు పరిహారాన్ని జమ చేయించారు. తమకు పరిహారం అందలేదని 40 మంది బాధిత రైతులు రోజుల తరబడి గొల్లుమంటుంటే, వారి సమస్యను పరిష్కరించకపోగా, పరిహారం కింద అక్రమంగా అందిన సొమ్మును దర్జాగా అనుభవిస్తున్నారు. తోట్లవల్లూరు మండలంలో రైతుల పంట నష్టపరిహారం జాబితాను తప్పులతడకగా రూపొందించిన స్థానిక వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది.. ఆ తర్వాత పాల్పడిన చీకటి వ్యవహారాలకు పై ఘటనలే నిదర్శనాలు.

పరిహారం.. ఫలహారం

తోట్లవల్లూరు రైతుల వరద పరిహారం మాయంలో ఎన్నో కథలు

వ్యాపారుల వద్ద రైతుల అప్పులు తీర్చేందుకేనట..!

- ఆధార్‌తో పరిహారాన్ని వ్యాపారుల ఖాతాలకు మళ్లించారట..!
- వింతగా ఉన్న వ్యాపారుల సమాధానాలు
- సహకరించిన వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది
- తప్పుల తడకగా వరద బాధిత జాబితా రూపకల్పన
- అసలు రైతులు కాకుండా బంధువుల పేర్లతో..
- గౌడ సొసైటీ భూములపై రూ.25 లక్షలు స్వాహా
- లబోదిబోమంటున్న అసలు రైతులు
- అవినీతి వ్యవహారంపై గొంతెత్తని రాజకీయ నేతలు
- అధికారులను రక్షించే ప్రయత్నాలు



తోట్లవల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది సెప్టెంబరులో కృష్ణానది వరద కారణంగా తోట్లవల్లూరు నార్త్, సౌత్ లంకలు, రొయ్యూరు, తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం, కాళింగదిబ్బలంక, పాములలంక, తుమ్మలపచ్చికలంక, పిల్లివానిలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు లంకలు, పొట్టిదిబ్బలంక, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, కనిగిరిలంక, ములకలపల్లిలంక పరిధిలో 5,237 మంది రైతులకు చెందిన 2,033.50 హెక్టార్లలో వివిధ రకాల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైతులను ఆదుకునేందుకు వరద వచ్చిన 15 రోజుల్లోనే ప్రభుత్వం రూ.7.16 కోట్లు పరిహారంగా అధికారులు రూపొందించిన బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలైంది.

గౌడ సొసైటీపైనే కన్ను

ఈ అక్రమాలు అధికంగా గౌడ వీల్డు సొసైటీ సర్వే నెంబరు 331/1 భూముల్లో జరగటం గమనార్హం. గౌడ కులస్తులకు కాకుండా, ఇతర కులస్తులకు ఇక్కడ పరిహారం రావటం అధికారుల అవినీతికి పరాకాష్టగా మారింది. ఇక్కడ రూ.25 లక్షల వరకు పరిహారం పక్కదారి పట్టిందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులోనే ఇంత భారీ అక్రమాలకు పాల్పడ్డారంటే మారుమూల లంకల్లో పరిస్థితి ఏమిటోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తోట్లవల్లూరులో 40 మంది రైతులకు నష్టపరిహారం రాలేదని తిరుగుతున్నా.. న్యాయం చేసేందుకు ఏ ఒక్క నేత ముందుకు రాలేదని, పైగా అవినీతి అధికారుల రక్షణకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏం జరిగింది..?

ఆగస్టులో పంటల ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాగా, మాగాణి పొలాల్లో నెలపాటు వరి, చెరుకు, మెట్టకంద, పసుపు పంటల నమోదు జరిగింది. ఆ తరువాత సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా ఈ-క్రాప్ నమోదు చేయలేకపోయారు. అలా చేయని వారికి కూడా పది రోజుల్లోనే ఎన్యుమరేషన్ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దాంతో అధికారులు.. ఈ-క్రాప్ నమోదును కార్యాలయాల్లో కూర్చుని, రైతులు ఏ పంట చెబితే అదే నమోదు చేసేశారు. ఈ వివరాలనే ఎన్యుమరేషన్‌గా ప్రభుత్వానికి పంపటంతో తక్షణమే నష్టపరిహారం రైతుల మిగతా 6లో..

పోలీస్ కస్టడీకి బియ్యం నిందితులు

నేడు ఏడు గంటల పాటు పోలీస్ విచారణ

- హాజరుకానున్న గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీడ్రైవర్
- పేర్ని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు
- పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డికి బెయిల్ మంజూరు

మచిలీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను ఏడు గంటల పాటు పోలీస్ కస్టడీకి అనుమతినిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేర్ని గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించనున్నారు. అనంతరం వీరిని మళ్లీ రిమాండ్‌కు పంపుతారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు జిల్లా కోర్టు ముందస్తు బెయిల్‌ను గతేడాది డిసెంబరు 30వ తేదీన మంజూరు చేసింది. ఆ తర్వాత ఆమె పోలీసుల విచారణకు హాజరయ్యారు. సీఎంఆర్ బియ్యం మాయం కేసులో ఏ-2గా ఉన్న గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని చెప్పినట్లుగానే తాను చేశానని చెప్పడంతో పోలీసులు ఈ కేసులో ఏ-6గా మాజీ మంత్రి పేర్ని నాని పేరును చేర్చారు. అయితే పేర్ని నాని తనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం హైకోర్టులో ఈ కేసు విచారణకు రాగా, మంగళవారం నాటికి విచారణను వాయిదా వేశారు. దీర్ఘకాలం పాటు పేర్ని నాని గోడౌన్ నుంచి సీఎంఆర్ బియ్యం మాయం కావడం, ఈ వ్యవహారంలో గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీడ్రైవర్, పేర్ని నాని కుటుంబ సభ్యుల ఖాతాలకు నగదు మళ్లింపు తదితర అంశాలపై పోలీస్ కస్టడీకి వచ్చే నిందితులను పోలీసులు విచారణ చేయనున్నారు. ఈ కేసులో మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. నిందితులను వారం రోజులపాటు పోలీసులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, ఏడు గంటలపాటు మాత్రమే కస్టడీకి అనుమతులు ఇచ్చారు. కాగా, జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కోటిరెడ్డిని ఇదే కేసులో గతేడాది డిసెంబరు 30వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఆయనకు స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి సోమ వారం బెయిల్‌ను మంజూరు చేశారు.

ఈ-క్రాప్ ఎందుకు జాప్యం చేశారు..?

- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

8లో



ఇద్దరు అభ్యర్థులకు అస్వస్థత

- మహిళా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఘటన

8లో

ఈ-ఆఫీసు విధానం ఎందుకు అమలు చేయట్లేదు..?

- దుర్గగుడి ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈవో, సూపరింటెండెంట్, సిబ్బందికి ఈవో నోటీసులు

8లో

డీఆర్ఎం కార్యాలయంలో కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ ప్రారంభం

8లో



నేనెళ్లిపోతా..!

వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ

- అప్పటివరకు మెడికల్ లీవ్ ఇవ్వాలని మరో దరఖాస్తు
- కుదరదని చెప్పిన ఉన్నతాధికారులు
- టెండర్లలో లోటుపాట్లు, ఫిర్యాదులు, కేసుల నేపథ్యంలోనే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఉమ్మడి కృష్ణాజిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) విద్యాసాగర్ స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకోవడం చర్చకు దారితీస్తోంది. డి.వెంకటరమణ బదిలీ తర్వాత ఆ స్థానంలో విద్యాసాగర్ ఇన్‌చార్జి ఎస్ఈగా వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలవటంతో ఆయన అనేక కోర్టు కేసులను ఎదుర్కొన్నారు. ఈ విషయాలతో తీవ్ర ఆందోళన చెంది, స్వచ్ఛంద పదవీ విరమణ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వీఆర్ఎస్‌కే కాకుండా, వెంటనే సెలవులకు కూడా ఆయన దరఖాస్తు చేశారు. అయితే, విద్యాసాగర్ సెలవు ప్రతిపాదనలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. సెలవులు ఇవ్వటానికి నిరాకరించినట్టు తెలిసింది. అయినా.. మెడికల్ లీవ్స్ పెట్టేందుకు విద్యాసాగర్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

టెండర్లలో వివాదాలు

ఇటీవల మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో ఓఅండ్ఎం పనులకు నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలిచారు. దీనిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా మిగతా 6లో..

సంక్రాంతికి దూరప్రాంతాల నుంచి సొంతూర్లకు వచ్చే ప్రయాణికులను దోచుకునేందుకు ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సిద్ధమవుతున్నారు. మూడు రెట్ల వరకు చార్జీలను పెంచి దోపిడీకి తెరతీస్తున్నారు. పెంచిన ధరలను తమతమ వెబ్‌సైట్లలోనూ ఉంచారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.600కే ప్రయాణికులను తీసుకొచ్చే ప్రైవేట్ బస్సులు ఈ పండక్కి ఏకంగా రూ.2,225 మేర వసూలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నాయి. లోకల్ ట్రావెల్ ఆపరేటర్లు అయితే రూ.2 వేలలోపు చార్జీ తీసుకుంటున్నారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో సొంతూర్లకు వచ్చే వారిని, 18, 19, 20 తేదీల్లో ఇక్కడి నుంచి తిరిగి హైదరాబాద్ వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని ఈ ధరలను పెంచుతున్నారు.

– (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సంక్రాంతి దందా

పండక్కి ప్రైవేటు బస్సు ఆపరేటర్ల బరితెగింపు ▸ మూడు రెట్లు వరకు చార్జీల పెంపు

- హైదరాబాద్ నుంచి వచ్చేవారికి ముందస్తుగా..
- చెన్నై, బెంగళూరు, విశాఖపట్నంకు భారీగా..
- ఈ నెల 11, 12, 13, 18, 19, 20 తేదీల్లో అమలు
- ఆర్టీసీ బస్సుల్లో మాత్రం నామమాత్రమే..



ఆర్టీసీలో సాధారణ చార్జీలే..

ఆర్టీసీ బస్సుల్లో మాత్రం సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. రవాణా నెట్‌వర్కింగ్ సైట్లలో హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే ప్రైవేట్ బస్సుల ధరలు చూస్తే హడలెత్తిపోవాల్సిందే. ఇంటర్ సిటీ స్మార్ట్ బస్‌లో రూ.599 నుంచి రూ.2,259కు పెంచారు. ఫ్రెష్ బస్‌చార్జీ రూ.1,999గా నిర్ణయించారు. యోలో బస్ (బెంజ్) అయితే ఏకంగా రూ.2,900 ఉంది. ఎలక్ట్రిక్ బస్సుల ధర కూడా పెరిగింది. రూ.450 నుంచి రూ.900కు పెంచేశారు. విజయవాడ నుంచి చెన్నైకు రికార్డు స్థాయిలో రూ.3,500గా నిర్ణయించారు. వైఎస్ఆర్ ట్రావెల్స్ అనే సంస్థ ఏసీ సీటర్/ఏసీ స్లీపర్ సర్వీసుకు రూ.8,000 చార్జీ వసూలు చేస్తోంది. విజయవాడ నుంచి బెంగళూరుకు కూడా రికార్డు స్థాయిలో రూ.2,100 ధర నిర్ణయించారు. లోకల్ ట్రావెల్స్ అయితే రూ.2,500 నుంచి రూ.2,800 వరకు పెంచారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో కూడా భారీగా ధరలను పెంచేశారు. ఆన్‌లైన్ ఆపరేటర్స్‌తో పాటు లోకల్ ఆపరేటర్లు కూడా రూ.2,500 మేర వసూలు చేస్తున్నారు.

పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదు

- అన్ని జిల్లాల్లో పుస్తక మహోత్సవాలు
- పుస్తక ప్రియుల పాదయాత్రలో మంత్రి కందుల దుర్గేష్
- పుస్తకం సజీవం : సీపీఐ రామకృష్ణ
- మంచి ఆలోచనలకు పునాది : కె.శ్రీనివాస్

కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదని సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో పుస్తక మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో చారిత్రాత్మక గ్రంథాలయాల ఆధారంగా సాహితీ పర్యాటకానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్రను ఆయన సోమవారం ప్రారంభించారు. విజయవాడలో ప్రతీ ఏడాది ఆరంభంలో నిర్వహించే పుస్తక మహోత్సవంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆకాడమీ వద్ద పాదయాత్రను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. పుస్తకప్రియులు, విద్యార్థులు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన ముగింపు సభలో మంత్రి మాట్లాడారు. ఏదైనా విషయంపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకోవడానికి పుస్తకాన్ని మించిన సాధనం లేదన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విజ్ఞానాన్ని సమకూర్చుకోవడం అవసరమేనని అభిప్రాయపడ్డారు. దాని కారణంగా పుస్తక పఠనకు దూరం కాకూడదని విద్యార్థులకు సూచించారు. పుస్తక మహోత్సవం పుస్తక పఠనను పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. భాషాసాహిత్య వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం రెండూ కొనసాగిస్తామని తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, రమేష్ కార్తీక్ నాయక్‌కు అభినందనలు తెలియజేశారు. సభలో వారిని వక్తలు సత్కరించారు.

పుస్తకం సజీవం

- కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

డిజిటల్ యుగంలో ముద్రించిన పుస్తకానికి కాలం చెల్లిందనేది అవాస్తవం. రోజూ చదువుతూ ఉంటేనే చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని తగిన విధంగా మనల్ని మనం అభివృద్ధి చెందడం సాధ్యపడుతుంది. పుస్తక మహోత్సవానికి స్టేడియాన్నిచ్చినందుకు పవన్ కళ్యాణ్‌కు అభినందనలు. ఇటువంటి పుస్తక మహోత్సవాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి.



పుస్తకాలు తిలకిస్తున్న పాఠశాల విద్యార్థినులు

మంచి ఆలోచనలకు పుస్తకం పునాది

- కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు

పుస్తక పఠనం మంచి ఆలోచనలు ఇస్తుంది. మంచి వైపు మొగ్గేలా చేస్తుంది. నేర్చుకునే శక్తిని ఇస్తుంది. బాలలంతా మంచి పుస్తకాలను, సాహిత్యాన్ని చదవడం అలవాటు చేసుకోవాలి. సినిమా, టీవీల కన్నా పుస్తకం గొప్పది. పుస్తకపఠనం ఆనందం కలిగిస్తుంది. మనిషికి తప్పొప్పులు తెలుస్తాయి. పుస్తకం ప్రతిపాదించే విలువలతోనే మంచి సమాజ నిర్మాణం సాధ్యపడుతుంది.

సంస్కారాన్ని నేర్పుతుంది

- సాహితీ వేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

పుస్తకాలు చదివి ఎంతోమంది అభివృద్ధి చెందారు. సాటి మనుషుల పట్ల ఎలా మెలగాలి? సమాజంలో సంస్కారవంతంగా, ప్రయోజనకరంగా ఎలా బతకాలి అనే విషయాన్ని సాహిత్యం అలవరుస్తుంది. సాహిత్యం చదవడం విద్యార్థి జీవితంలో భాగం కావాలి. నేను పుస్తకాలు చదివి బాగుపడ్డాను. యువ తరం సైన్సుతో పాటు సాహిత్యం చదవాలి. మానవ ప్రవర్తనకు మెరుగులు దిద్దేది సాహిత్యమే. నాగరిక, సంస్కార జీవన వేదికలు పుస్తకాలే. మంచి పౌరులుగా ఎదగాలంటే పుస్తకాలు చదవడం అనివార్యం.



మంత్రి దుర్గేష్‌కు పుస్తకాలు అందజేస్తున్న వక్తలు

మంచి పుస్తకాలను ప్రోత్సహించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పిల్లలు మంచి పుస్తకాలను ఎంపిక చేసుకోవడం నేర్చుకోవాలి. అప్పుడే వారు రాబోయే కాలానికి దూతలుగా మారతారు. మంచి పుస్తకాలను సమాజంలోని వారంతా ప్రోత్సహించాలి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్, పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, కార్యదర్శి టి.మనోహర్ నాయుడు, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రచురణ కర్తలు



విజ్ఞాన యాత్ర!

- పుస్తక మహోత్సవంలో విద్యార్థుల సందడి
- ప్రముఖుల పుస్తకాలను పరిచయం చేస్తున్న ఉపాధ్యాయులు

విజయవాడ సిటీలైఫ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పుస్తక మహోత్సవంలో విద్యార్థుల సందడి మొదలైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులతో 'విజ్ఞాన' యాత్ర చేయిస్తున్నాయి. విద్యార్థులను పుస్తక మహోత్సవానికి తీసుకెళ్లి, ప్రముఖుల రచనలను పరిచయం చేయాలని జిల్లావిద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనితో విద్యార్థులంతా పుస్తక మహోత్సవానికి తరలివస్తున్నారు. పుస్తకాల కొనుగోళ్లతో సంబంధం లేకుండా అన్ని స్టాల్స్‌లోకి విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఆంగ్ల సాహిత్యాన్ని చూపించారు. బాలసాహిత్యంపై మక్కువతో పదో తరగతి విద్యార్థులు ఆల్ ఇన్ వన్‌ల కొనుగోలుకు ఆసక్తి చూపించారు. సోమవారం ఒక్కరోజే సుమారు 500 మంది విద్యార్థులు పుస్తక మహోత్సవాన్ని తిలకించారు. విద్యార్థుల రాకతో సాహిత్యప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుస్తక మహోత్సవాలను విద్యార్థులతో సందర్శింప చేయడంతో పాటు పుస్తక పఠనను పెంచాలని అభిప్రాయపడుతున్నారు.

అతి పెద్ద పుస్తకం!

విజయవాడ సిటీలైఫ్ : ఆస్ట్రేలియా, అమెరికా, లండన్ దేశాల్లో స్థిరపడిన వారి సంతకాలు ఆ పుస్తకంలో కనిపిస్తాయి.. పుస్తక మహోత్సవానికి వచ్చిన వాళ్లంతా ఎటు నుంచి ఎటు తిరిగినా ఆ పుస్తకం వద్దకు కచ్చితంగా వెళ్తున్నారు. అదే స్టాల్ నంబరు196లో శ్రీనివాస పబ్లిషర్స్ ఏర్పాటు చేసిన అతిపెద్ద పుస్తకం. ఈ పబ్లిషర్స్ తమ స్టాల్ వద్ద ఎనిమిది అడుగుల ఎత్తు, ఏడు అడుగుల వెడల్పుతో రెండు పేజీలతో పెద్ద పుస్తకాన్ని ఏర్పాటు చేశారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన వారు సంతకాలు చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. దీనికి నిర్వాహకులు 'బిగ్ బుక్-గెట్ క్లిక్' అని నామకరణం చేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ దేశాల్లో స్థిరపడి నగరానికి వచ్చిన వాళ్లంతా ఈ పుస్తకంపై సంతకాలు చేస్తున్నారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన సాహితీవేత్తలు, పుస్తక ప్రియులు దీనిపై సంతకాలు చేయడంతోపాటు పెద్ద పుస్తకం ముందు నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారు. పుస్తక మహోత్సవంలో ఈ అతిపెద్ద పుస్తకం ప్రత్యేకార్షణగా నిలిచింది.



ఉచితంగా బుక్‌మార్క్, జేబు క్యాలెండర్



శ్రీనివాస పబ్లిషర్స్ స్టాల్‌లో చిన్నారుల కోసం ఉచితంగా బుక్‌మార్క్‌లు, జేబులో పెట్టుకునే క్యాలెండర్లు ఇస్తున్నారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన విద్యార్థులు ఈ స్టాల్‌కు వెళ్లి వాటిని తీసుకోవచ్చు. వాటిని వివిధ రంగుల్లో ఇక్కడ అందుబాటులో ఉంచారు. శ్రీనివాస పబ్లిషర్స్ ఇన్‌స్టా ఖాతాను అనుసరించిన వారికి పంచాంగం క్యాలెండర్‌ను ఉచితంగా ఇస్తున్నారు.

గన్నవరం వైసీపీ నేతలతో
మంత్రి సారథికి ఏంపని?

- అక్రమ మైనింగ్‌పై నిజాలు చెప్పేందుకు మేం సిద్ధం!
- గన్నవరం టీడీపీ నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

గన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి, కార్యకర్తలపై దాడిచేసిన వారికి ఆశ్రయం కల్పించటం మంత్రి సారథికి తగదని గన్నవరం టీడీపీ నేతలు అన్నారు. వైసీపీకి చెందిన కడియాల సతీష్, లింగమనేని కిషోర్‌లు యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల సుబ్రమణ్యం, కార్యదర్శి దొంతు చిన్న, ఎస్ఎస్‌పి కెనాల్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు మంత్రి పార్థసారథి కార్యాలయంలోనే ఉంటున్నారని ఆరోపించారు. నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని.. వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు వంశీ, కొడాలి నానిల లారీలను రంగులు మార్చి బినామీగా ఉన్న కడియాల సతీష్ అక్రమ మైనింగ్ చేస్తున్నారని.. లారీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేస్తే మంత్రి పార్థసారథి కార్యాలయం నుంచి ఫోన్‌చేసి వదిలేయాలని ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. నూజివీడులో ఏం జరుగుతుందో అంతా తమకు తెలుసన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా నూజివీడు నేతలు మాట్లాడటం సరికాదన్నారు. యార్లగడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై నూజివీడు టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు పరుచూరి నరేష్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరావు, కొండేటి వెంకటేశ్వరరావు, పుట్టా సురేష్, గండేపూడి నితీష్‌కుమార్, ముక్కపాటి చైతన్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు!

- పందేల కట్టడికి ప్రత్యేక బృందాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో కలిసి పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు నిర్వహించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కోడిపందేల నిషేధంపై రాష్ట్ర పశుసంవర్ధకశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జంతుహింస నివారణ చట్టం ప్రకారం.. కోడిపందేలను నిషేధించడం జరిగిందన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గ్రామ, మండలాల వారీగా తనిఖీ బృందాలు..

హైకోర్టు మార్గదర్శకాల మేరకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. గ్రామస్థాయి బృందంలో వీఆర్వో, కానిస్టేబుల్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, మండలస్థాయి బృందంలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, మండల పశుసంవర్ధక అధికారి, జిల్లాస్థాయి బృందంలో ఆర్డీవో/సబ్‌కలెక్టర్, డీఎస్పీ/ఏసీపీ, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సభ్యులుగా వుంటారన్నారు. ఈ బృందాలు స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, చట్టాల్లోని అంశాలను వివరించాలన్నారు. ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా చట్టప్రకారం నేరమేనని పేర్కొన్నారు. ఎక్కడా బరులు ఏర్పాటు కాకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వుండాలని, నిబంధనల మేరకు తహసీల్దార్లు, ఆర్డీవోలు వారి పరిధిలోని పంచాయతీలకు నోటిఫికేషన్లు జారీచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

14 నుంచి జంతు సంక్షేమ పక్షోత్సవాలు

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 31వ తేదీ వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరుగనున్నాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ, జంతు సంరక్షణ సంఘాలు, రెవెన్యూ, విద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొంటూ ఈ పక్షోత్సవాలు నిర్వహించాలని సూచించారు. పక్షోత్సవాల సందర్భంగా చర్చలు, నిపుణులతో ఇంటర్వ్యూలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికేట్లు, బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. జంతు సంక్షేమ చట్టాలు, నిబంధనలు తదితరాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో కైండ్‌నెస్‌క్లబ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతోందని, అధికారులు, సిబ్బంది కీలక భాగస్వామ్యంతో పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎం.హనుమంతరావు, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


నేనెళ్లిపోతా..!

(5వ పేజీ తరువాయి)

అందాయి. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగానే ఆకుమర్రు ఓఅండ్‌ఎం కాంట్రాక్టును కట్టబెట్టారు. దీనిపై ఇటీవలే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)కు ఫిర్యాదు అందింది. ఈ టెండర్ నిబంధనలకు విరుద్ధమని గారపాటి సూర్యకిరణ్ అనే కాంట్రాక్టర్ ఇన్‌చార్జి ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లడంతో.. 'మమ్మల్నే ప్రశ్నిస్తావా..' అంటూ ఆ కాంట్రాక్టర్‌కు చెందిన వాటర్ బిల్స్ ఆపేయడంతో పాటు పేమెంట్లు రాకుండా చేస్తామని బెదిరించారు. తనను బెదిరించారంటూ ఆ కాంట్రాక్టర్ ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశాడు. నందిగామలో కూడా ఓఅండ్‌ఎం స్కీమ్‌ల టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా పిలిచారు. తప్పు జరిగిందన్న ఫిర్యాదులు వచ్చినపుడు ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న విద్యాసాగర్ పునఃపరిశీలించాలి. ఆపని చేయకపోవటం వల్ల విద్యాసాగర్ ప్రత్యక్ష పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నందిగామ ఓఅండ్‌ఎం పనులపై కూడా పలువురు కోర్టును ఆశ్రయించటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. వీటన్నింటి నుంచి తప్పించుకోవటానికే విద్యాసాగర్ స్వచ్ఛంద పదవీ విరమణ ఆలోచన చేస్తున్నారన్న పుకార్లు వస్తున్నాయి.

దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా రామచంద్రమోహన్

వన్‌టౌన్ : దేవదాయ అదనపు కమిషనర్‌గా ఉన్న కె.రామచంద్రమోహన్‌ను దుర్గామల్లేశ్వర దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.



నందిని ఫెర్టిలైజర్స్ యజమాని శివరామకృష్ణకు అందిన పరిహారం, శివరామకృష్ణ షాపులో పనిచేసే వర్కర్ తల్లి శివసామ్రాజ్యానికి అందిన నష్టపరిహారం

పరిహారం.. ఫలహారం

(5వ పేజీ తరువాయి)

ఖాతాలకు జమ అయ్యింది. ఈకేవైసీ వేలి ముద్రలు లేకున్నా, బ్యాంకు ఖాతా నెంబర్‌కు లింకైన ఆధార్‌కార్డు అందిస్తే చాలనే ప్రభుత్వ వెసులుబాటును అధికారులు, సిబ్బంది తెలివిగా ఉపయోగించుకున్నారు. అవినీతి, అక్రమాలకు తెరలేపారు. లంకల్లో ఒక్కో సర్వే నెంబరు కింద వందల ఎకరాలు ఉండటం కూడా వీరికి కలిసొచ్చింది. తమ బంధువులు, సన్నిహితులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానుల ఆధార్‌కార్డులు సేకరించేసి పంటల నష్టపరిహారాన్ని పక్కదారి పట్టించారు. అయితే, కొందరు నిజమైన వరద బాధిత రైతులకు నష్టపరిహారం అందలేదు. రైతులు ఆర్‌ఎస్‌కేలకు వెళ్లగా, సమయం దాటిపోయిందని సమాధానమిచ్చారు. అయితే, తోట్లవల్లూరుకు చెందిన బాధిత రైతులు.. వరద బాధిత జాబితా కావాలని అధికారులను నిలదీశారు. వ్యవసాయ, తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాల్సి ఉండగా, అధికారులు గుట్టుగా ఉంచారు. దాంతో బాధిత రైతులు సమాచార హక్కు చట్టం ద్వారా జాబితా సేకరించారు. వారంతా జాబితాలోని పేర్లు పరిశీలించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

అధికారులదే ప్రధాన పాత్ర

ఈ అవినీతి బాగోతంలో వ్యవసాయ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందని తెలుస్తోంది. ఫీల్డుకు వెళ్లినప్పుడు పొలం ఏ రైతుదో వీఆర్వో నిర్ధారిస్తాడు. ఏ పంట ఉందో నమోదు చేసే బాధ్యత అగ్రికల్చర్ అసిస్టెంట్‌లది. వీరు జాబితా రూపొందించాక వ్యవసాయ, ఉద్యాన అధికారులు, తహసీల్దార్ సంతకం చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. కానీ, ఎలాంటి పరిశీలన చేయకుండానే అధికారులు జాబితాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపారు. వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు మాత్రం సైట్ లాగిన్ వీఏఏల చేతుల్లోనే ఉంటుందని చెబుతున్నారు. తప్పులు జరిగిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరిస్తున్నారు. కాగా, ఆ నిర్వాకంలో పాత్రధారులైన అధికారులు, సిబ్బంది సస్పెన్షన్లే కాకుండా, గుర్తించిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని రైతులు కోరుతున్నారు.

మాకు పరిహారం రానట్టేనా?

- అక్కినేని వినోద్, తోట్లవల్లూరు రైతు

పంట నష్టపరిహారం రాని 40 మంది బాధిత రైతులందరం జిల్లా అధికారులకు పూర్తి వివరాలతో వినతిపత్రాలు ఇచ్చాం. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేను మూడు ఎకరాల పసుపు, నాలుగు ఎకరాల కంద, ఎకరం గుమ్మడితోట వేసి వరదలకు నష్టపోయాను. కానీ, ఎకరం కందకు, ఎకరం పసుపుకు మాత్రమే పరిహారం వచ్చింది. పంటలు సాగు చేయని, రైతులు కానివారికి చక్కగా పరిహారం ఇప్పించిన అధికారులు నిజమైన రైతులకు ఎందుకు ఇవ్వరు...?

ఎంజేపీ అంటే ఓ బ్రాండ్

- కార్పొరేట్‌కు దీటుగా గురుకుల పాఠశాలలు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడి



పీఎస్ఎల్వీ చంద్రయాన్-2 తిలకిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలు అంటేనే ఓ బ్రాండ్‌గా గుర్తింపు సాధించాయని బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. సోమవారం మోపిదేవిలోని బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోన్-2 గురుకుల పాఠశాలల ఆటల పోటీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల సొసైటీ బీసీ సంక్షేమశాఖ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన 19 జట్ల క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఎస్ఎల్వీ చంద్రయాన్-2 రాకెట్ నమూనాను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఐదేళ్ల కాలంలో విద్యావ్యవస్థను, రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ భ్రష్టు పట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరునెలల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తొలివిడతగా రూ.13వేల కోట్లను మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు కేటాయించారని తెలిపారు. క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనివ్వటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లకు మంత్రి, ఎమ్మెల్యేలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్, సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎంపిపి రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ కె.వీరరవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో భోజనం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

భావితరాల భవిష్యత్ కోసమే శంకరన్ రీసోర్స్ సెంటర్లు

మోపిదేవి : భావితరాల విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశ్యంతోనే అన్ని రంగాల్లోనూ విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఎస్ఆర్.శంకరన్ రీసోర్స్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ మత్స్యకారుల ఆశ్రమ హాస్టల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్.ఆర్.శంకరన్ రీసోర్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్టల్, పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలన్న సంకల్పంతో ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండే అన్ని రంగాల్లోనూ నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని బుద్ధప్రసాద్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

టీడీపీతోనే గ్రామీణాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధి చేయడం టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ కార్యదర్శి గుడివాడ విజయానంద్ అన్నారు. రేమల్లెలో అంతర్గత సీసీ రహదారుల అభివృద్ధి పనులను సోమవారం టీడీపీ నాయకులు కలపాల రాధాకృష్ణ, యనమదల సుధాకరరావులతో కలిసి పర్యవేక్షించారు. వెంకటకృష్ణారావు, చంద్రకాంత్, కుమార్ పాల్గొన్నారు.



రేమల్లెలో జరుగుతున్న సీసీ రహదారి పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు



ఆటోలో ఇరుక్కుపోయిన డ్రైవర్ ఆలీ

లారీని ఢీకొన్న ఆటో

● ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కె.సీతారాంపురం వద్ద హనుమాన్‌జంక్షన్ బైపాస్‌లో ఆపి ఉన్న లారీని ఆటో ఢీ కొన్న ఘటన సోమవారం తెల్లవారుఝామున జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఇరుక్కుపోయిన డ్రైవర్ షేక్‌ఆలీ గంటపాటు నరకయాతన అనుభవించాడు. హనుమాన్‌జంక్షన్ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డు ప్రక్కన ఆపి టైరు మార్చుకుంటున్నారని, ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఆటో వేగంగా ఢీ కొట్టిందని తెలిపారు. ఆటో డ్రైవర్ షేక్ ఆలీ క్యాబిన్ లోనేఇరుక్కుపోయాడని వివరించారు. ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం అని తెలిపారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ సాయంతో గన్నవరం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఆగని బస్సులు.. విద్యార్థుల అగచాట్లు!

బందరు రోడ్డుపై ప్రొద్దుటూరు వద్ద ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, గ్రామస్థులు
అధికారులు దృష్టి సారించాలంటున్న తల్లిదండ్రులు

(కంకిపాడు - ఆంధ్రజ్యోతి)

బందరు రోడ్డుపై ప్రొద్దుటూరు వద్ద బస్సులు ఆపకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ ఛైర్మన్ జిల్లాకు చెందిన కొనకళ్ల నారాయణ దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.. మండలంలోని ప్రొద్దుటూరు నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులతో పాటు గ్రామస్థులు వివిధ పనులపై విజయవాడ, బంద రు వెళ్లి రావాల్సి ఉంటుంది. రోజు మొత్తం మీద ఉదయం 8 గంటలకు మాత్రమే ఆర్టీసీ బస్సు ఊరులోకి వస్తుంది. ఆ తరువాత బస్సుల రాకపోకలు ఉండవు. దీంతో విద్యార్థులు, ఉద్యోగస్తులు, వివిధ పనులపై వచ్చే వారు ఈ రెండు కిలో మీటర్లు ఆటోలను, సైకిళ్లను ఆశ్రయిస్తుంటారు. బందరు రోడ్డు మీదకు వచ్చిన తరువాత విజయవాడ, బందరు వెళ్లేందుకు బస్సులు ఆగడం లేదు. అక్కడకు వచ్చేటప్పటికి ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆగకుండా వెళ్లిపోతున్నారు. దీంతో కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బందరు రోడ్డుపై కాలేజీకి వెళ్లేందుకు బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలి

జిల్లాకే చెందిన ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ ప్రొద్దుటూరు గ్రామస్థుల మొర ఆలకించాలి. ఊరులో నుంచి రెండు కిలో మీటర్లు నడిచి వచ్చి ఇక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. తీరా ఇక్కడకు వస్తే బస్సులు ఆగడం లేదు. దీంతో విద్యార్థులు సమయానికి స్కూళ్లకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారు. అలాగే వివిధ పనులపై వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా హైర్ బస్ డ్రైవర్ల తీరుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యే దృష్టి సారించాలి. ఆర్టీసీ ఛైర్మన్ ప్రత్యేక చర్యలు చేపట్టటంతో పాటు బస్సులు ఆగేలా చర్యలు చేపట్టాలి.

- సుబ్బారావు, గ్రామస్థుడు



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ విజయరాజు, ఇతర గురువులు

బ్రదర్ జోసఫ్ తంబి గొప్ప విశ్వాసి

కర్నూలు మేత్రాసనం ఆదోని డీన్ రెవ.ఫాదర్ కోల విజయరాజు

ఉంగుటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి దేవుని పట్ల సంపూర్ణ విశ్వాసంతో కూడిన ధన్యజీవితాన్ని గడిపాడని, ఆయన విశ్వాసమే నేడు అనేక మందిని ఆయన సమాధి వద్దకు నడిపిస్తోందని, తంబి చేసిన మధ్యస్థ ప్రార్థనల ద్వారా ఎంతోమంది ఎన్నో మేలులు, స్వస్థతలు పొందుతున్నారని కర్నూలు మేత్రాసనం ఆదోని డీన్ రెవ.ఫాదర్ కోల విజయరాజు అన్నారు. తంబి 80వ వర్థంతి తిరునాళ్ల సందర్భంగా పెదఅవుటపల్లిలోని తంబి పుణ్యక్షేత్రంలో సోమవారం మూడవరోజు నవదిన ప్రార్థనలను ఘనంగా జరిపారు. తొలుత దివ్యపూజాబలిని సమర్పించిన ఫాదర్ విజయరాజు విశ్వాసము-క్రైస్తవ జీవితము అనే అంశంపై సందేశమిచ్చారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ పరిశుద్ధాత్ముని పవిత్ర జలంతో విశ్వాసులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విచారణగురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, సహాయకగురువులు రెవ.ఫాదర్ గొన్నూరి ఏసుపాదం, ఇతర గురువులు, కన్యాస్త్రీలు, గుడిపెద్దలు, సంఘస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మండవ జయదేవ్

మెరుగైన వైద్యసేవలందించాలి

ఉయ్యూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాలకు చికిత్స కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలందించాలని ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ అన్నారు. సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టాలిసిన అంశాలపై చర్చించారు. వైద్యశాలలో నూతన ఎక్సరే మిషన్, ఇతర పరికరాలు, టెక్నీషియన్ ఏర్పాటు గురించి ఉన్నతాధికారులకు తెలియజేయాలని కమిటీ సమావేశంలో తీర్మానించారు. వైద్యశాలకు అవసరమైన జనరేటర్ ఏర్పాటు చేసేందుకు దాత ముందుకు వచ్చారని, అదేవిధంగా మిగిలిన పరికరాలు అందచేసే దాతలు ముందుకు రావాలన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ మురళీ, ఎంపీడీవో శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడు రంగారావు రాజీనామా

గన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ గన్నవరం పట్టణం అధ్యక్ష పదవికి తిరివీధి రంగారావు సోమవారం రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను మండల పార్టీకి పంపించామని, తన వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దిశానిర్దేశం

పెనమలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో ప్రధానంగా ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వాటిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. సోమవారం పోరంకిలోని తన కార్యాలయంలో రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులతో ఆయన సమావేశమై చర్చించారు. వచ్చే కొద్ది రోజుల్లో ప్రజలకు అందించనున్న రేషన్ కార్డులు, పట్టాదార్ పాసుపుస్తకాల మంజూరు, అర్హులయిన లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. పెన్షన్ల తనిఖీ నివేదిక వేగంగా పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనుల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. తరచూ గ్రామ సచివాలయాలను తనిఖీ చేయాలని, పెండింగ్ బిల్లుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఇంటిపన్నుల వసూళ్లను వేగవంతంగా వసూలు చేయాలని, కొత్త ఇంటి పన్నులను త్వరగా వేయాలని ఆదేశించారు. మునిసిపాలిటీలో, మండలాల్లోని ఇతర గ్రామాల్లో అత్యవసరంగా చేయవలసిన కార్యక్రమాలను వివరాలతో సహా తనకు నివేదించాలని ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణ అధిక ఫిర్యాదులు వస్తున్నాయని, వీధిదీపాల నిర్వహణలో ఎటువంటి అలసత్వం కూడదని ఆదేశించారు. సమావేశంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ చెక్కు అందజేత

తాడిగడప మునిసిపాలిటీ పోరంకి గ్రామానికి చెందిన నెరుసు శివపార్వతి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన అరవై వేల విలువైన ఎల్వోసీ చెక్కును స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ఆమెకు అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కొమ్మినేని వెంకటేష్, తుమ్మలపల్లి హరికృష్ణ, వాసు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జేడీ

పనులు వేగవంతం చేయాలి

జేడీ డాక్టర్ ఎన్.నరసింహులు

గన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెమన్ బ్యాంక్‌లో పశుసంవర్థక శాఖ డివిజన్ కార్యాలయ ఏర్పాటు పనులను జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.నరసింహులు సోమవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 8, 9 తేదీల్లో కేంద్ర బృందం వస్తుందని, మండలంలోని గ్రామాలను సందర్శించి పశువుల వివరాలు తెలుసుకుంటారని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దారి తప్పి ఎటు వెళ్లాలో తెలి యక ఇబ్బందిప డుతున్న 11ఏళ్ల బాలికను వీరవల్లి పోలీసులు క్షేమంగా నంద్యాల పోలీసులకు సోమవారం అప్పగించారు. నంద్యాల మండలం పున్నవరం గ్రామానికి చెందిన గొర్రల దీపిక తల్లి వెంట గన్నవరం వచ్చింది. తల్లి పనికి వెళ్లగా గన్నవరం నుంచి జంక్షన్ వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కి వీరవల్లి కూడలిలో దిగింది. అక్కడ ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్న బాలికను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్సై శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి వివరాలు ఆరా తీశారు. బాలిక భయంతో సమాధానం చెప్పక పోవడంతో ధైర్యం చెప్పి ఆహారం అందించారు. తదనంతరం తన పేరు, అడ్రస్ వివరాలు.. ఇంటి నుంచి వచ్చిన విధానం అడిగి తెలుసుకుని నంద్యాల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. నంద్యాల నుంచి పోలీసులు హుటాహుటిన వీరవల్లి వచ్చి బాలికను తీసుకు వెళ్లారు. ఎస్సై శ్రీనివాస్‌ను సీఐ సత్యనారాయణ అభినందించారు.



బాలికను నంద్యాల పోలీసులకు అప్పగిస్తున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఉయ్యూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన ఆదర్శప్రాయమైన విద్య నేటి సమాజంలో ఎంతో అవసరమని న్యాయవాది, అధ్యాపకుడు ఎండీ రియాజ్ అన్నారు. ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వవికాసం, పర్సనాలిటి డెవలప్‌మెంట్‌పై అవగాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రియాజ్ పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విద్యతో పాటు అవసరమైన స్కిల్స్ నేర్చుకోవటంలో ప్రతి విద్యార్థి శ్రద్ధ వహించాలన్నారు. ఆదర్శ వంతమైన వ్యక్తులను ప్రేరణగా తీసుకుని జీవిత ఆశయాన్ని ఏర్పటు చేసుకోవాలని మరో అతిథి వైవీ రావు సూచించారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కొలసాని రవికుమార్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. విద్యార్థి దశనుంచి పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని యోగా గురువు రవి సుధాకర్ అన్నారు. మహంకాళి పవన్ ఫణికుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఎండీ రియాజ్

వైద్య ఖర్చులు అందజేత

హనుమాన్‌జంక్షన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మహిళకు మానవత జంక్షన్‌శాఖ వైద్య ఖర్చులకు రూ.5వేలు ఆర్థికసాయం అందించింది. స్థానిక కృష్ణనగర్ కాలనీకి చెందిన దూదిగం హైమావతి నరాలు, బలహీనతతో బాధపడుతోంది. సోమవారం స్థానిక మానవత కార్యాలయంలో ఆమె వైద్య ఖర్చులు నిమిత్తం మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా ఆర్థికసాయం అందించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యశిబిరం

హనుమాన్‌జంక్షన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ ఫెర్టిలిస్ విధానియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సంతాన సాఫల్య ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డా.నవ్య సంతాన సాఫల్యతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంతానలేమితో ఇబ్బంది పడు తున్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉచిత వీర్య పరీక్షలు చేశారు. ట్రస్టు చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ట్రస్టు సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

పేదలకు దుస్తుల వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అవసరాలను గర్తించి సేవలందించడం ద్వారా జీవితంలో ఆత్మసంతృప్తి కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు వివిధ రకాల సేవలందిస్తున్న రాణా వెల్ఫేర్ సొసైటీ అభినందనీయమని జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్‌బెన్నీ అన్నారు. కానుమోలుకు చెందిన రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అమరావతి ఎస్సీ కాలనీలో సోమవారం నిర్వహించిన దుస్తులు, పాదరక్షల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాలకు సవేరా అపార్ట్‌మెంట్స్ వారి ద్వారా సేకరించిన దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్, కార్యదర్శి సుంకర పార్థసారథి, సీహెచ్ శ్రీకాంత్, జనచైతన్యసమితి కోఆర్డినేటర్ వేలితోటి అనిల్‌కుమార్, పేస్ ఫౌండేషన్ కార్యదర్శి పారుపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ఆర్డీవో బీఎస్ హెలా షారోన్

ఉయ్యూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో బీఎస్ హెలా షారోన్ అన్నారు. కోడిపందేల నియంత్రణపై రెవెన్యూ డివిజన్ పరిధి మండలస్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటివి జరుగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని, కూడళ్లలో హెచ్చరికలు చేస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.



కోడిపందేల హెచ్చరిక బ్యానర్‌తో ఆర్డీవో, పోలీసులు, అధికారులు

గన్నవరం : మండలంలో జూదాలు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాటలు జరగకుండా అధికారులతో కమిటీలు సోమవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేకాట కోడిపందేలు నిర్వహించటంపై నిషేధ ఆజ్ఞలు ఉన్నాయని, గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు జూదాలు ఆడేవారిని గుర్తించి హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు.



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

కంకిపాడు : మండలంలో ఏ ప్రాంతం లోనైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంకిపాడు తహసీల్దార్ భవన్నారాయణ, ఎస్సై తాతాచార్యులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవన్నారాయణ, ఎస్సై తాతా చార్యులు మాట్లాడుతూ, కోడిపందేలు, జూదం నిర్వహణపై నిషే.దం విధించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవన్నారాయణ, ఎస్సై తాతాచార్యులు



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఘనంగా జాతీయ వాలీబాల్ స్కూల్ గేమ్స్ పోటీలు

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కందుల, ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగల్రాజపురంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా 68 జాతీయ వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల టోర్నీ అట్టహాసంగా సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు సాగే ఈ పోటీలను పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోటీల డిక్లరేషన్‌ను గద్దె ప్రకటించారు. రాష్ట్రంలో క్రీడలకు చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని వారు అన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులకు రూ.7కోట్ల వరకు నగదు ప్రోత్సాహకాలను ఈ సారి క్రీడా విధానంలో ప్రకటించామన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు ఉత్కంఠగా ప్రారంభం అయ్యాయి. మొత్తం 25 రాష్ట్రాల టీమ్‌లు బరిలో దిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, శాప్ మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరీ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి రవికాంత, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దోనేపూడి దయాకర్, కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హోరాహోరీగా తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్ క్రీడాకారిణులు

ప్రొటోకాల్ పంచాయితీ!

దుర్గగుడిలో పోలీస్ ప్రొటోకాల్ పంచాయితీ నడుస్తోంది. పోలీస్ ఉన్నతాధికారులకే పరిమితమైన ప్రొటోకాల్ దర్శనాలను ప్రైవేటు వ్యక్తులకూ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు ప్రొటోకాల్ కానిస్టేబుళ్లు. అయితే తమకు దుర్గగుడిపై ప్రొటోకాల్ విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ విభాగాల వారూ పట్టుబట్టడంతో ఈ వ్యవహారం పోలీస్ ఉన్నతాధికారుల వద్దకు చేరింది. ఇంద్రకీలాద్రిపై భద్రతను గాలికొదిలేసిన పోలీస్‌శాఖ ప్రొటోకాల్ విధుల కోసం మాత్రం పోటీపడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- విజయవాడ/వన్‌టౌన్ - ఆంధ్రజ్యోతి

ఇంద్రకీలాద్రిపై నిబంధనలకు విరుద్ధంగా దర్శనాలు చేయిస్తున్న ప్రొటోకాల్ కానిస్టేబుళ్లు

- విధుల్లో నలుగురు కానిస్టేబుళ్లు
- తమకు విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ విభాగాల పట్టు
- పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం



ఇంద్రకీలాద్రికి వచ్చే పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర అధికారుల కుటుంబాలను దుర్గమ్మ దర్శనానికి తీసుకువెళ్లేందుకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు కానిస్టేబుళ్లను దుర్గగుడిపై ప్రొటోకాల్ బాధ్యతల్లో నియమిస్తుంటారు. వన్‌టౌన్ సీఐ ఆదేశాల మేరకు దేవస్థానానికి వచ్చే ఉన్నతాధికారులు, ఇతర అధికారులకు వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించే బాధ్యత ఆ నలుగురు కానిస్టేబుళ్లు చూస్తుంటారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కొండపై ప్రొటోకాల్ డ్యూటీ నిర్వహించే వారిలో ఇద్దరు కానిస్టేబుళ్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకూ అమ్మవారి దర్శనం చేయించి వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్టు ఇటీవల ఆరోపణలు వచ్చాయి. నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు, అధికారుల వివరాలను వన్‌టౌన్ స్టేషన్ నుంచి కొండపైనున్న ప్రొటోకాల్ సిబ్బందికి తెలపాలి. అలాగే దేవస్థానం సమాచార కేంద్రంలోనూ తెలియపరచాలి. అయితే సమాచార కేంద్రంలో చెప్పకుండా ప్రొటోకాల్ సిబ్బంది పదుల సంఖ్యలో భక్తులను తీసుకువెళుతూ దర్శనం చేయిస్తున్నారు. దీనిపై ఇటీవల దేవస్థానం అధికారులు పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

మాకూ ప్రొటోకాల్ విధులు..!

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందే ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తుండటం తొలి నుంచీ వస్తున్న ఆనవాయితీ. అయితే ఇటీవల వన్‌టౌన్ ట్రాఫిక్, క్రైమ్ విభాగాల అధికారులు కూడా తమ విభాగాలకు చెందిన సిబ్బందిని దుర్గగుడిపై ప్రొటోకాల్ విధుల్లో నియమించేందుకు సిద్ధమవ్వడం గమనార్హం. ఈ మేరకు దుర్గగుడి అధికారులను కూడా కోరారు. అయితే ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పశ్చిమ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీపీ) వద్దకు ప్రొటోకాల్ పంచాయితీ చేరింది. ట్రాఫిక్, క్రైమ్ విభాగాల సిబ్బందిని దుర్గగుడిపై ప్రొటోకాల్‌లో నియమించేందుకు ఏసీపీ నిరాకరించారు. దీంతో ఈ పంచాయితీ ఉన్నతాధికారుల వద్దకు చేరినట్టు సమాచారం.

దర్శనాలకే ప్రొటోకాల్ సిబ్బంది పరిమితం

దేవస్థానంలో విధులు నిర్వహించే వన్‌టౌన్ పోలీసులు కేవలం తమ శాఖకు చెందిన వారిని అమ్మవారి దర్శనం చేయించటమే తప్ప దేవస్థానంలో భక్తుల భద్రత గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కొండపైన, కొండ దిగువన పోలీస్ నిఘా ఉండేది. లా అండ్ ఆర్డర్, క్రైమ్ విభాగం సిబ్బంది నిఘా బాధ్యతల్లో ఉండేవారు. ప్రస్తుతం కొండపైన, కొండ కింద క్రైం సిబ్బంది కనిపించడం లేదు. కేవలం ప్రొటోకాల్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తూ తమ శాఖకు చెందిన వారికి దర్శనం చేయించటానికి, డబ్బులు తీసుకుని ప్రైవేటు వ్యక్తులకు దర్శనాలు చేయించడానికే పరిమితమవుతున్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నెలల తరబడి అన్నదాన విభాగంలో భోజనం చేస్తూ కొండపైనే ఉంటున్నారు. అలాంటి వారి గురించి వీరు పట్టించుకోవడం లేదని సిబ్బంది బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రద్దీ వేళల్లో దొంగతనాలు జరిగినా పట్టించుకునే నాథుడే లేడని విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి దేవస్థానంపై పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని దేవస్థానం ఉద్యోగులు, భక్తులు కోరుతున్నారు.

కృష్ణాజిల్లాలో మొత్తం ఓటర్లు 15,40,356 మంది

- పురుష ఓటర్లు 7,46,385 మంది
- మహిళా ఓటర్లు 7,93,916 మంది
- ఇతర ఓటర్లు 55 మంది
- జిల్లా వ్యాప్తంగా 1769 పోలింగ్ కేంద్రాలు

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం: జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా - 2025ను కలెక్టర్ బాలాజీ సోమవారం ప్రకటించారు. ఈ జాబితాలను జిల్లాలోని 1769 పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచనున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,40,356 మంది ఉన్నట్లుగా నిర్ధారించారు. వీరిలో పురుష ఓటర్లు 7,46,385 మంది, మహిళా ఓటర్లు 7,93,916 మంది, ఇతర ఓటర్లు 55 మంది ఉన్నట్టుగా చూపారు. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 47531 మంది జిల్లాలో అధికంగా ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పురుషులు, మహిళలు, ఇతర ఓటర్ల వివరాలిలా ఉన్నాయి

అసెంబ్లీ	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్ల సంఖ్య
గన్నవరం	134481	145101	11	279593
గుడివాడ	97920	106790	13	204723
పెడన	82923	84551	0	167474
మచిలీపట్నం	94812	101934	11	196757
అవనిగడ్డ	104501	107701	15	212217
పామర్రు (ఎస్సీ)	89359	95179	3	184541
పెనమలూరు	142389	152660	2	295051
మొత్తం	746385	793916	55	1540356

ఎన్టీఆర్ జిల్లా ఓటర్లు 17,06,983

- పురుష ఓటర్లు 8,31,839
- మహిళా ఓటర్లు 8,74,992 మంది
- ఇతర ఓటర్లు 152
- జిల్లా వ్యాప్తంగా 1792 పోలింగ్ కేంద్రాలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు విడుదల చేసింది. ఎస్ఎస్ఆర్ - 2025 ప్రకారం జిల్లావ్యాప్తంగా మొత్తం 17,06,983 మంది ఓటర్లున్నారు. పురుష ఓటర్లు 8,31,839 మంది కాగా, మహిళా ఓటర్లు 8,74,992 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 43,153 మంది ఎక్కువగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లదే హవాగా ఉంది. జిల్లావ్యాప్తంగా థర్డ్ జెండర్ ఓటర్లు 152 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 1792 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టుగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్ల సంఖ్య
తిరువూరు	234	102182	105412	6	207600
విజయవాడ వెస్ట్	253	126865	129683	33	256581
విజయవాడ సెంట్రల్	267	134963	142975	50	277988
విజయవాడ ఈస్ట్	298	132388	138118	24	270530
మైలవరం	296	137212	145450	20	282682
నందిగామ	222	99513	106177	5	205695
జగ్గయ్యపేట	222	98716	107177	14	205907
మొత్తం	1792	831839	874992	152	1706983

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో విజయవంతంగా మొదటి ప్లాక్ బ్లాకీ థెరపీ కంటి చికిత్స

పెనమలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కంటి క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మకంగా పేర్కొనే చికిత్సను రాష్ట్రంలో మొదటిసారిగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆయా వివరాలను వైద్యులు డాక్టర్ అనసూయ గంగూలీ సోమవారం వెల్లడించారు. ఈ వైద్య చికిత్స చరిత్రాత్మకమని, వినూత్న ఆవిష్కరణగా పేర్కొన్నారు. దైహిక చికిత్సల వంటి చికిత్సలు నిరుపయోగమైనప్పుడు రెటినోబ్లాస్టామా కేసుల్లో దీన్ని తరచుగా ఉపయోగిస్తారన్నారు. 2020లో ప్రారంభించి మౌలిక సదుపాయాల అభివృద్ధితో కూడిన అటామిక్ రెగ్యులేటరీ బోర్డుకు అనుగుణంగా నాలుగేళ్లపాటు చేసిన ప్రయోగాలకు ఇది ప్రతిఫలమని వ్యాఖ్యానించారు. విజయవాడ అమెరికన్ అంకాలజిస్టులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ రామకృష్ణ, ఫిజిసిస్ట్ సురేష్, హైదరాబాద్ అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ విజయానంద్ రెడ్డి, ఫిజిసిస్ట్ పద్మగణేశన్ పాల్గొన్నారు.

ఈ ఏడాదే తల్లికి వందనం అమలు చేయాలి

- విద్యార్థినులపై అత్యాచారాలను అరికట్టాలి
- జిల్లా ఎస్ఎఫ్ఐ మహాసభలు ప్రారంభం
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన తల్లికి వందనం ఈ విద్యా సంవత్సరంలోనే అందజేయాలంటూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో రెండు రోజుల పాటు ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా 50వ మహాసభ ప్రారంభమైంది. రేవతీ సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కోనేరుసెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడారు. కృష్ణా వర్శిటీలో హాస్టల్ భవనాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. విద్యార్థులపై ఇటీవల అత్యాచారాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. ఎన్నికల్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తి చేసి యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గంలో డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. 77వ జీవో రద్దు చేసి, ఫీజు రీయంబర్స్‌మెంట్ సౌకర్యం పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎస్. సమరం, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్, నేతలు సమీర్, సలీం, కీర్తి, నాగేంద్ర, ప్రదీప్, అక్షయ్, జయకర్ పాల్గొన్నారు.



మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలను అందజేశారు. అనంతరం ఆయన పంచహారతులు సేవలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.



సమావేశమైన అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

- జిల్లా కార్యదర్శి రమాదేవి

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలందరినీ రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని కృష్ణాజిల్లా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ 34వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుట్టాయిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘ నేత జి.కుమారి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ రిటైరైన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో ఐసీడీఎస్‌కు నిధులను మరింతగా పెంచాలన్నారు. ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. సీఐటీయూ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, బందరు మండల కార్యదర్శి సీహెచ్ జయరావు, మచిలీపట్నం ప్రాజెక్టు సంఘ అధ్యక్షురాలు టి.సుజాత, సౌజన్య మాట్లాడారు.

మహిళా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఇద్దరు అభ్యర్థులకు అస్వస్థత

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా పరుగెడుతూ ఇద్దరు అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరులపాడుకు చెందిన రమ్య, తోట్లవల్లూరుకు చెందిన గీత అస్వస్థతకు గురయ్యారు. కాగా వీరులపాడుకు చెందిన రమ్యను మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు.

ఈ-క్రాప్ ఎందుకు జాప్యం చేశారు..?

- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల, నందివాడ మండలాల నుంచి పంట వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయలేదని, రైతుల నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేసి 22 రోజులకు పైగా అయింది, ఇన్ని రోజులుగా సమస్యలను పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో జరిగిన మీకోసం సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ పద్మావతిపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, తెలుగురావుపాలెంకు చెందిన రైతు గుగులోతు కోటేశ్వరరావు ఇతర రైతులు తమ పొలాల్లో సాగుచేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయకపోవడంతో ధాన్యం విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయిందని 22 రోజుల క్రితం అర్జీ దాఖలు చేశారు. ఈ అంశంపై కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ వ్యవసాయ శాఖ నుంచి అధికంగా అర్జీలు రావని, వచ్చిన ఒకటీ, రెండు కూడా పరిష్కరించకుండా పెండింగ్‌లోనే పెడితే ఎలాగని ప్రశ్నించారు. దీనిపై తాను సమీక్ష చేస్తానని అన్నారు. ఇదే సమయంలో వ్యవసాయశాఖ జేడీ ఈ సమస్యలను పౌరసరఫరాలశాఖ అధికారులు పరిష్కరించాలని అనడంతో కలెక్టర్ మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-క్రాప్ నమోదులో పౌరసరఫరాలశాఖకు సంబంధం లేదని కలెక్టర్ అన్నారు. ధాన్యం కొనుగోలు అంశాలు పెండింగ్‌లో ఎందుకు పెట్టారని కలెక్టర్ పౌరసరఫరాల శాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లా మేనేజర్ కిందిస్థాయి అధికారి సమావేశంలో ఉండటంతో ఆయన తనవద్ద సరైన సమాచారం లేదన్నారు. దీనిపై జేసీ కలుగజేసుకుని జిల్లా అధికారులు రాకుంటే, కిందిస్థాయి అధికారులు సరైన సమాచారంతో రావాలని, ఇక్కడకు వచ్చి కూర్చుని వెళ్లిపోతే ఎలాగని ప్రశ్నించారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా రిజిస్ట్రార్ విభాగం, నీటిపారుదల, వైద్యశాఖ, తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న మీకోసం అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ ప్రారంభం

రైల్వే స్టేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ (ఆర్పీఎఫ్ డ్రై క్యాంటీన్), కొత్త వాహనాలను ప్రారంభించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అధికారులతో కలిసి డ్రై క్యాంటీన్‌ను ప్రారంభించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ క్యాంటీన్‌ను మంజూరు చేసింది. రైలు సురక్షా కళ్యాణ్ నిధి నుంచి రూ.10లక్షల గ్రాంట్‌తో డ్రై క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ డ్రై క్యాంటీన్‌లో పదవీ విరమణ పొందిన ఆర్పీఎఫ్ సిబ్బందికి, వారి కుటుంబాలకు సేవలందిస్తారు. దీనికి సంబంధించి జారీ చేసిన కార్డు ద్వారా సదుపాయాలను పొందవచ్చు. ఈ క్యాంటీన్‌లో కిరాణా వస్తువులు, గృహ వినియోగానికి సంబంధించిన ఇతర వస్తువులు, యూనిఫారాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ద్విచక్రవాహనాలు, కార్లు వంటి వాటిని రాయితీ ధరలతో పొందే అవకాశం ఉంది. మరోవైపు డివిజన్‌లోని ఆర్పీఎఫ్ కోసం 38 సీట్ల కొత్త బస్సు, 8 బుల్లెట్ మోటార్ సైకిళ్లను కూడా ఇదే సమయంలో ప్రారంభించారు. విజయవాడ - గూడూరు, విజయవాడ - విశాఖపట్నం, విజయవాడ - మచిలీపట్నం - నరసాపూర్ సెక్షన్ల పరిధిలోని వివిధ ప్రాంతాలకు ఆర్పీఎఫ్ సిబ్బందిని తరలించేందుకు ఈ బస్సును వినియోగిస్తారు. రైల్వే స్టేషన్లలో సంఘ విద్రోహక కార్యకలాపాలు, దాడులు వంటి సంఘటనలు జరిగినప్పుడు హుటాహుటిన ఆర్పీఎఫ్ సిబ్బందిని తరలించటానికి ఈ బస్సును వినియోగిస్తారు. దీంతో పాటు రాజమండ్రి, చీరాల, గుడివాడ, రాయనపాడు, క్రైం బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్, అప్పియార్డ్, డివిజనల్ స్క్వాడ్‌లోని ఆర్పీఎఫ్ వినియోగించుకునేందుకు బుల్లెట్ మోటార్ సైకిళ్లను అందించారు. నేరాలు జరిగినప్పుడు అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది స్పందించటానికి ఈ వాహనాలను వినియోగిస్తారు. ఇందుకోసం రైల్వేబోర్డు రూ.38 లక్షలను మంజూరు చేసింది. వాహనాల తాళం చెవులను డీఆర్ఎం సిబ్బందికి అందజేశారు. ఏడీఆర్ఎంలు పి.అడ్విన్, కొండా శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ విజయవాడ డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి. మధుసూదనరావు, డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ తోకల వల్లేశ్వర బాబూజీ, సంబంధిత అధికారులు, ఆర్పీఎఫ్ శాఖల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ఆర్‌పీఎఫ్ సిబ్బందికి తాళం చెవి అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్

ఈ-ఆఫీసు విధానం ఎందుకు అమలు చేయట్లేదు..?

- దుర్గగుడి ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈవో, సూపరింటెండెంట్, సిబ్బందికి ఈవో నోటీసులు

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బంది అందరూ సంబంధిత లావాదేవీల ఫైళ్లను ఈ-ఆఫీసు ద్వారానే పంపించాలని, దుర్గగుడి ఈవో రామచంద్ర మోహన్ నోటీసులు జారీ చేశారు. తక్షణమే అందరూ కూడా ఈ-ఆఫీసు ద్వారానే లావాదేవీలు జరపాలని నోటీసులో పేర్కొన్నారు. ఇంతవరకు ఆయా విభాగాల వారు ఈ-ఆఫీసు ద్వారా ఫైళ్లు పంపించకుండా భౌతికంగా ఫైల్స్ పంపించటంపై వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ-ఆఫీసును కచ్చితంగా నడపాలని 2022లోనే దేవదాయ కమిషనర్ ఉత్తర్వులిచ్చినా ఎందుకు అమలు చేయాలేదని ప్రశ్నించారు. దేవదాయ శాఖ కమిషనర్ 2022 ఫిబ్రవరి 10న, కిందటేడాది డిసెంబరు 31న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో ఈ-ఆఫీసు సిస్టమ్‌ను అమలు చేయాలన్నారన్నారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ-ఆఫీసు విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. ఇందులో అనేక ప్రభుత్వ విభాగాలు టైమ్‌లైన్‌ను విస్మరించి ఈ-ఆఫీసును అమలు చేయకపోవటంపై ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఇది అమలు చేసినట్టు నివేదిక పంపించాలని ఈవో తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తమ ఫైళ్లను భౌతికంగా కాకుండా ఈ-ఆఫీసు ద్వారానే పంపాలని, లేకుంటే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.



లయోలా మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న వాకర్స్ సభ్యులు

మళ్లీ మొదటికొచ్చిన వాకర్ల సమస్య

- లయోలా గేటు ఎదురుగా నిరసన ప్రదర్శన
- పోలీసుల జోక్యంతో విరమించిన వాకర్లు

భారతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాకర్ల పోరాటం మళ్లీ మొదటికొచ్చింది. ఆదివారం గేట్లు తెరచి నడవనిచ్చిన కళాశాల యాజమాన్యం సోమవారం అనుమతి నిరాకరించింది. ఉదయం 5గంటలకు నడవడానికి వచ్చిన వాకర్లు గంటకుపైగా నిలబడినా గేట్లు తెరవకపోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో వాకర్లలంతా కళాశాలకున్న అన్ని గేట్లను బ్లాక్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. అప్పటికే కళాశాల గ్రౌండ్‌లో నడుస్తున్న హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు అరగంటకు పైగా కళాశాలలో ఉండిపోయారు. కళాశాల విద్యార్థులు కూడా అరగంటకు పైగా కళాశాల బయట ఉండిపోయారు. నిరసన ప్రదర్శన ఉధృతం కావడంతో మాచవరం పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, నిరసన విరమించుకోవాలని వాకర్స్‌కు తెలిపారు. విద్యార్థుల పరీక్షల దృష్టిలో ఉంచుకొని ఏసీపీ దామోదర్ మాట్లాడగా వాకర్స్ నిరసనను విరమించారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

13న గోదారంగనాథస్వామి కల్యాణం

పామర్రు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కురుమద్దాలి, కనుమూరు గ్రామాల్లోని చెన్నకేశవ ఆలయాల్లో ఈనెల13న గోదారంగనాథస్వామి కల్యాణం జరిపిస్తామని పామర్రు గ్రూప్ టెంపుల్స్ అధికారి జె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పామర్రులోని పుట్లమ్మర్మ ధర్మసత్రాన్ని సర్వహంగులతో ప్రజల ఉపయోగార్థం తిరిగి అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలిపారు. మండలంలోని ప్రజలు వివాహాది శుభకార్యాయాలకు, చిన్న చిన్న ఫంక్షన్లకు నామమాత్రపు రుసుంతో సత్రాన్ని వినియోగించుకోవచ్చని అన్నారు. పామర్రు విష్ణు ఆలయంలో ఈనెల 10న నిర్వహించే ముక్కోటి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి, ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకోవాలని ఆయన సూచించారు.



విద్యాశాఖ మండల కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

నూతన మెనూ అమలు చేయలేం

● ధరలు పెరగడంతో విద్యార్థికి రూ.20 అదనపు భారం
● ప్రభుత్వం పునరాలోచన చేయాలి
● మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

పెదపారుపూడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్త మెనూ అమలు చేయాలంటే ఒక విద్యార్థికి రూ.20లు చొప్పున భారం పడుతోందని, సీఐటీయూ నాయకురాలు ఉప్పలపాటి అనూష అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ధర్నా నిర్వహించింది. మెనూలో పుదీనా రైస్‌కు బదులుగా కూరగాయలతోనే కూర వండాలని హెచ్ఎంలు అంటున్నారని, ప్రస్తుతం ఉన్న ధరలను బట్టి మెనూ చాలా భారంగా ఉందని వారు వాపోయారు. కొత్త మెనూ ప్రకారం ఖర్చు ఎక్కువ అవుతోందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విద్యాశవాఖ కార్యాలయ సిబ్బంది వినతిపత్రం అందించారు. బి.రమణమ్మ, జె.విజయ, లత, టి.సమాధానం పాల్గొన్నారు.

డేటా సైన్స్ వినియోగంతో పారిశ్రామికాభివృద్ధి


ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావు

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డేటా సైన్స్ వినియోగంతో దేశం పారిశ్రామికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీకల్యాణ్‌కుమార్ అన్నారు. వైద్యరంగంలో డేటా సైన్స్‌ను ఉపయోగించడం వలన అనేక ప్రయోజనాలున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కంప్యూటర్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'డేటా అనాలసిస్ యూజింగ్ పైథాన్' అనే అంశంపై వారంరోజుల జాతీయస్థాయి వర్క్‌షాపును కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య సోమవారం ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ సబ్జెక్టులను విద్యార్థులు నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. కళాశాలలోని బీటెక్ విద్యార్థులకు వారంపాటునిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లతో వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. వర్క్‌షాపులో 240మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. డీన్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి గంజి వెంకటరత్నం, సమన్వయకర్త కె.లక్ష్మీప్రసన్న విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

● కలెక్టర్ బాలాజీకి భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ వినతి


కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న మురళీకృష్ణ

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గుడివాడ పట్టణంలో రోజు రోజుకూ రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయని, ప్రజల ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలుగుతోందని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ బాలాజీని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ కోరారు. సోమవారం మచిలీపట్నంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీకి ఆయన వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతోందని, అందుకు అనుగుణంగా రహదారులు లేవని, రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి అనువైన స్థలం లేదన్నారు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ నిర్వాహకులు షెల్లార్లు, పార్కింగ్ ప్రదేశాల్లోనూ వ్యాపారం నిర్వహించుకుంటున్నారన్నారు. పట్టణంలో భారీ దిమ్మెలు నిర్మించి అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. గతంలోనే మున్సిపల్ కమిషనర్, డీఎస్పీల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని మురళీకృష్ణ కోరారు.

కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ రామకోటేశ్వరరావు హెచ్చరిక

గుడివాడ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులు, కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు చేసి కోడి పందేలు, జూదాలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు సంక్రాంతి వెళ్లే వరకు అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, రెవెన్యూ అన్ని శాఖల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం వార్షికోత్సవం


దాత గఫార్‌ను సత్కరిస్తున్న శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం సభ్యులు

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని విడిదియిల్లులో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 2024లో యాదవ సేవాసంఘానికి సహకరించిన దాతలను ఈ సందర్భంగా వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం

● భక్తులకు గణపతి సచ్చిదానంద స్వామీజీ పిలుపు

గుడివాడ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణకు పాటుపడదామని భక్తులకు గణపతి సచ్చిదానంద స్వామీజీ(అప్పాజీ) పిలుపునిచ్చారు. సోమవారం చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయ సముదాయం శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవ యాగాన్ని స్వామీజీ నిర్వహించారు. అనంతరం హరిప్రియ రాగ సాగర కార్యక్రమంలో అనుగ్రహభాషణ చేశారు. అష్టలక్ష్మీ దేవాలయం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ బొప్పుడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు, వేలాది మంది భక్తులు, కుటుంబసభ్యులతో వచ్చి స్వామిని దర్శించుకుని అష్టలక్ష్మీ ఆలయాన్ని, అమ్మవారిని దర్శించుకున్నారు.


చిన ఎరుకపాడులో అనుగ్రహభాషణ చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ


ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూచౌక్, కోతిబొమ్మ సెంటర్‌లో
అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నెహ్రూచౌక్ సెంటర్, కోతిబొమ్మ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని దళిత ఐక్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యానికి నాయకులు పొంగులేటి జయరాజు, దారం కరుణాకర్, వాసుపల్లి రాంప్రసాద్ వినతిపత్రం అందజేశారు. కోతిబొమ్మ సెంటర్‌లో తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ ప్రారంభంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎన్నికల్లో హామీ ఇచ్చారని దానిని నిలబెట్టుకోవాలని వారు కోరారు. కోటే రామచంద్రరావు, చింతా నాని, చప్పిడి జోషి, నీరుడు సురేష్, అశోక్, శేఖర్, చంద్రశేఖర్, తంటేపూడి అనిల్, రామకృష్ణ, రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు.


ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తానని, పేద విద్యార్థుల విద్యకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిధులు తీసుకొస్తానని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ అన్నారు. సోమవారం బంటుమిల్లి రోడ్డులో ఆర్యవైశ్య సంఘాలు, ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో సునీల్‌ను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్యులకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పెద్ద పీటవేస్తున్నారని ఆర్యవైశ్య ప్రముఖులు పేర్కొన్నారు. గోకవరపు సునీల్‌కు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవి రావడమే అందుకు నిదర్శనమన్నారు. ఆర్యవైశ్యుల్లో ఎన్నో పేద కుటుంబాలున్నాయని, వారు వ్యాపారం నిర్వహించుకునేందుకు బ్యాంకుల నుంచి రుణాలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు, ఉన్నత విద్యకు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరువీధి సుబ్బారావు, బెజవాడ బాజేశ్వరరావు, కృష్ణప్రసాద్, కొల్లి పవన్, శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

పురుగుమందుల అధిక వినియోగంతో అనర్థాలు


అపరాల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

గుడ్లవల్లేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అపరాలు సాగు చేసే రైతులు అవసరానికి మించి రసాయనిక పురుగుమందులు పిచికారీ చేయొద్దని, పురుగుమందుల అధిక వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో రైతులకు అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వేరుకుళ్లు తెగులు నివారణకు రిడోమిల్ గోల్డ్ మందును ఎకరానికి 200 మిల్లీగ్రాములు మొదలు మెత్తం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. దిగుబడి పెరగడానికి పోటాషియం నైట్రేట్ పూతదశకు చేరాక ఎకరానికి కేజీ చొప్పున పిచికారీ చేయాలని ఆమె సూచించారు. డాక్టర్ నవీన్, ఎం.వెంకటలక్ష్మి, కె.రేవతి రైతులకు అవగాహన కల్పించారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి పెరుమాళ్ల పాల్గొన్నారు.

9,10 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్టేడియం కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకే స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల ప్రదర్శన, వంటల పోటీలు, కబడ్డీ, స్లో సైక్లింగ్, కర్రసాము ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ప్రోత్సాహక కార్యక్రమాలు, ఆటల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో ఆటల పోటీలు

తోట్లవల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెనమకూరులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 13, 14 తేదీల్లో తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల మండలాల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తామని భారత యువజన సంఘం అధ్యక్షుడు మరీదు యోహాన్ సోమవారం తెలిపారు. 13న పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, స్లో సైకిల్, మోకు లాగుడు, షటిల్స్, 14న ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాలకు 99480 56094, 97038 93819 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

లైవ్ సర్టిఫికెట్ల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు

గుడ్లవల్లేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సర్వీసు, ఫ్యామిలీ పింఛన్‌దారుల నుంచి లైవ్ సర్టిఫికెట్లు స్వీకరించడానికి ట్రెజరీ సిబ్బంది గుడ్లవల్లేరు, కౌతవరం పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి పింఛనుదారుల నుంచి లైవ్ సర్టిఫికెట్లను సిబ్బంది తీసుకున్నారు. పింఛన్‌దారుల నుంచి ఐరిస్ సేకరించారు.

గుల్జార్‌చౌక్ మసీదు పెద్దల
అవినీతిపై విచారణ జరపండి

● కలెక్టర్ బాలాజీకి సామాజిక కార్యకర్త జంపాన వినతి

గుడివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధికారుల అనుమతి లేకుండా 2017 నుంచి 2022 వరకు గుల్జార్‌చౌక్ మసీదుకు చెందిన షాపులకు అడ్వాన్సుగా రూ.12లక్షలు మసీదు పెద్దలు వసూలు చేశారు. ఆ మొత్తాన్ని గతంలోనే నిర్మాణం పూర్తయిన నూర్ మసీదుకు వినియోగించినట్టు తప్పుడు సమాచారం ఇచ్చారు. మసీదు పెద్దల అవినీతిపై విచారణ జరపాలి.' అని సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీకి సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందించారు. వసూలు చేసిన రూ.12 లక్షల్లో రూ.4.48లక్షలు ఓచర్లు కూడా లేకుండా విత్‌డ్రా చేశారని, గతంలో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన వ్యక్తి ఈ అవినీతికి సహకారం అందించాడని ఆరోపించారు. గుడివాడ ఆర్డీవోతో విచారణ జరిపించాలని కలెక్టర్ బాలాజీని జంపాన కోరారు.

వక్ఫ్ భూములను సర్వే చేయించండి

పమిడిముక్కల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పత్తేలంకలో రైతుల ఆక్రమణలో ఉన్న 32.69 ఎకరాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు సర్వే చేయించాలని కలెక్టర్ బాలాజీకి మీకోసంలో వినతిపత్రం అందజేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. సర్వే చేసేలా ఉయ్యూరు ఆర్డీవో, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, సర్వే, ల్యాండ్ రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించాలని ఆయన కోరారు.

హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు

ఘంటసాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ హుండీల్లోని కానుకలు సోమవారం లెక్కించారు. 15 నెలల కాలానికి రూ.3,63,314 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. మచిలీపట్నం దేవదాయశాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కె.సీతారాంపురం వద్ద హనుమాన్‌జంక్షన్ బైపాస్‌లో ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటన సోమవారం తెల్లవారుఝామున జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఇరుక్కుపోయిన డ్రైవర్ షేక్ అలీ గంటపాటు నరకయాతన అనుభవించాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డు ప్రక్కన ఆపి టైరు మార్చుకుంటున్నారని, ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఆటో వేగంగా ఢీ కొట్టిందని తెలిపారు. ఆటో డ్రైవర్ షేక్ అలీ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడని వివరించారు. ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురానికి చెందినవాడని తెలిపారు. అలీని 108 అంబులెన్స్‌లో గన్నవరం ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.


ఆటోలో ఇరుక్కుపోయిన డ్రైవర్ అలీ

రెవెన్యూ సదస్సుల్లో 333 అర్జీలు

● 254 అర్జీలకు పరిష్కారం: తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి


జనార్దనపురం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి

నందివాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు సోమవారంతో ముగిశాయి. ఆఖరి సదస్సు జనార్దనపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 333 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. 254 అర్జీలు పరిష్కరించామన్నారు. మిగిలినవి అనాధీన భూములు, భూ సమస్యలవి అని తెలిపారు. త్వరలోనే వాటినీ పరిష్కరిస్తామన్నారు. మండలంలో 23 పంచాయతీలకు ఆరుగురు వీఆర్వోలే ఉన్నారని, ఒక్కో వీఆర్వో నాలుగు పంచాయతీల్లో పని చేయడం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని ఆయన తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జోజిబాబు, మండల సర్వేయర్ అనూష, రాహేలమ్మ, ఆర్ఐ గణేష్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, వీఆర్వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చోరగుడిలో 9 అర్జీలు

పమిడిముక్కల: ప్రజల సమస్యల పరిష్కారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, భూ సంబంధిత, ఇతర సమస్యలు తెలియజేస్తూ అర్జీలు అందజేయాలని ప్రజలకు తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ సూచించారు. చోరగుడిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు స్వీకరించామ ని తెలిపారు. డీటీ ఏసుపాదం, సర్పంచ్ కె.పూర్ణకుమారి పాల్గొన్నారు.

మోటూరులో 5 అర్జీలు

గుడివాడ రూరల్: మోటూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 5 అర్జీలు అందాయని తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. అన్ని అర్జీలకు పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు.

రావులపాడు పంచాయతీ కార్యాలయం వద్ద..

పెదపారుపూడి: రావులపాడు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వై.రంగారావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీఆర్వో సీహెచ్ సావిత్రి, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీ కోసంలో ఒకే దరఖాస్తు

కూచిపూడి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఒకే ఒక్క అర్జీ దాఖలైంది. కూచిపూడికి చెందిన పెళ్లూరి శారద నివేశన స్థలం కోసం దరఖాస్తు అందించినట్లు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. ఎండీవో జె.విమాదేవి, ఏవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ పరమాత్మ, ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

శ్రీకాకుళేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు

ఘంటసాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయంలోని హుండీల కానుకలు సోమవారం లెక్కించారు. 15 నెలల కాలానికి రూ.3,63,314 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. మచిలీపట్నం దేవదాయశాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు



పుదుచ్చేరి సీఎం రంగస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పుదుచ్చేరి సీఎంకు మంత్రి సవిత సత్కారం

మోపిదేవి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ రహదారి 216 మీదుగా ప్రయాణం చేస్తూ మోపిదేవిలోని రహదారి పక్కనే ఉన్న హోటల్‌లో విశ్రాంతి తీసుకునేందుకు సీఎం రంగస్వామి ఆగారు. మంత్రి, ఎమ్మెల్యేలు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.



క్షిపణి ప్రయోగ కేంద్రం పరిపాలనా కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

ఆర్డీవో గుల్లలమోద సందర్శన

నాగాయలంక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గుల్లలమోదలోని క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని ఆర్డీవో కె.స్వాతి, డీఆర్డీవో కల్నల్ సమీర్ శర్మ, తహసీల్దార్ ఎం.హరనాథ్‌లతో కలిసి సోమవారం సందర్శించారు. పరిపాలనా భవనాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రంలో పనుల వివరాలను సమీర్ శర్మను అడిగి తెలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో నాగాయలంక శ్రీరామపాదక్షేత్ర పుష్కరఘాట్‌ను కూడా రెవెన్యూ శాఖ అధికారులతో ఆమె సందర్శించారు. డీటీ మహమ్మద్ రఫీ, వీఆర్వో బి.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

నాగాయలంకలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 8వ తేదీ వరకు నాగాయలంక మండలంలో వేర్వేరు సమయాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.



మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో పల్లంగా ఉన్న ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే మండలి



విద్యార్థులకు ఫైల్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి, దాత ఫణికృష్ణ, మాజీ వీసీ ముత్యాలనాయుడు

పాఠశాలల అభివృద్ధిలో నిర్లక్ష్యం చూపొద్దు

● బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

మోపిదేవి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, ఆట స్థలాలు అభివృద్ధిపర్చటంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు.

మోపిదేవిలోని బీసీ మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో ఎస్.ఆర్.శంకరన్ రీసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన హాస్టల్, పాఠశాల గదులు, పరిసరాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా స్థాయి అధికారులతో కలసి పరిశీలించారు.

మత్స్యకారుల ఆశ్రమ పాఠశాల స్థలం పల్లంగా ఉండటం వల్ల విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఆట స్థలాల మెరకకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టగా, అధికారులు ఇంత కాలం ఏం చేస్తున్నారని ఆమె మందలించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ఆట స్థలం మెరక సమస్యను పరిష్కరించాలన్నారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించి అధ్వాన్నంగా ఉండటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు - నేడు పథకంలో ఏమి చేశారని ప్రశ్నించారు. పాఠశాలకు కలెక్టర్ నిధులతోనైనా వెంటనే రంగులు వేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఆంజనేయులు, జిల్లా అధికారి రమేష్, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తిగా విద్యార్థులు ఎదగాలి

చల్లపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, వివేకానంద, గాంధీ వంటి మహనీయుల జీవితాలు స్ఫూర్తిగా విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. రామిశెట్టి ఫణికృష్ణ(హైదరాబాద్) ఆర్థిక సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 413 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ఫోల్డర్స్ పంపిణీ, వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమం చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ, విద్యార్థులు కృషి చేస్తే ఎంతో ఎత్తుకు ఎదగవచ్చనీ, ఎదిగిన తర్వాత మూలాలు మర్చిపోరాదన్నారు. మందలో ఒకడిలా కాకుండా వందలో ఒకడిలా ఉండాలన్న స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తాపీ మేస్త్రి కొడుకు ఉన్నతస్థానానికి చేరుకుని తన మూలాలు మరిచిపోకుండా ప్రభుత్వ విద్యార్థులకు తనవంతు సహకారాన్ని అందిచంటం అభినందనీయని దాత రామిశెట్టి ఫణికృష్ణను అభినందించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి ఎం.ముత్యాలనాయుడు, యువనేత మండలి వెంకట్రామ్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, విశ్రాంత ఎంఈవో వేమూరి మురళీకృష్ణ, షేక్ నబీమోరి, బొందలపాటి వీరబాబు, తమ్మన సతీష్‌కుమార్, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాజీ ఉపకులపతి ముత్యాలనాయుడు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగించారు.



విద్యార్థులకు ఫైల్స్ అందజేస్తున్న మండలి వెంకట్రామ్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో పురోగమించాలి

అవనిగడ్డ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో పురోగమించాలని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ కోరారు. గాంధీక్షేత్రంలో చల్లపల్లికి చెందని రామిశెట్టి ప్రసాద్ జ్ఞాపకార్థం వారి కుమారుడు, వ్యాపారవేత్త రామిశెట్టి ఫణికృష్ణ ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్, జడ్పీ హైస్కూల్, వేకనూరు జడ్పీ హైస్కూల్, ఏపీఆర్ఎస్ పులిగడ్డ పదవ తరగతి విద్యార్థులు 300 మందికి సర్టిఫికెట్స్ పంపిణీ చేసి, వ్యక్తిత్వ వికాసం సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించే దాతలు ఆదర్శనీయులన్నారు. నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఎం.ముత్యాల నాయుడు, దాత రామిశెట్టి ఫణికృష్ణ, ఎస్ఆర్‌వైఎస్పీ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, ఎంఈవోలు ఎన్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, హెచ్‌ఎం జిఎన్‌బి.గోపాల్, తమ్మన సతీష్ పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న అప్పికట్ల అప్పారావు

క్రీడలతోనే మానసికోల్లాసం

కోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే విద్యార్థులకు మానసికోల్లాసం సాధ్యమవుతుందని ఎంఈవో టి.వి.ఎం.రామదాసు అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలోత్సవ్‌ను స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నాలుగు విభాగాలలో ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా గ్రీన్ స్పాన్ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ అప్పికట్ల అప్పారావు విచ్చేశారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ ఎం అలా వెంకట రమణ, పీడీ జి.శ్రీనివాస పెరుమాళ్ళ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మర్రే గంగయ్య, కోట రాంబాబు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఘంటసాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గోగినేనిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. గణిత ఉపాధ్యాయులు డి.ఎల్.వి.బిజిలి రాణి తన సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ తయారు చేయించి ప్రింటు తీసి, బైండింగ్ చేసిన బుక్ రూపంలో పిల్లలందరికీ ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగపర్చుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి సమష్టి కృషి

కోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల అధ్యక్షులు సమిష్టిగా కృషి చేయాలని తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కోడూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద జేఈ విజయ్ కుమార్ అధ్యక్షతన కోడూరు డీసీ పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో సాగునీటి ఎద్దడి లేకుండా తగు ప్రణాళిక రచించి అవసరమైన పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డీఈ బాబు నాయక్, జేఈ కరీమ్, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, సాగునీటి సంఘా అధ్యక్షులు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



గోదాదేవికి సారె సమర్పణ

అవనిగడ్డ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గీతా మందిరంలో వేంచేసి ఉన్న గోదాదేవి అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. అర్చక స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిపారు. భక్తులు అమ్మవారికి వివిధ రకాలు పూలు, పండ్లు, మిఠాయిలు, చలిమిడి, పండ్ల రసాలు, పానకం సమర్పించారు. భక్తిగీతాలు, కోలాట ప్రదర్శనలు జరిగాయి. అర్చక స్వామి నరసింహమూర్తి కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. లక్ష్మీతాయారమ్మ, అన్నపూర్ణ, అశ్విని, రాధ పర్యవేక్షించారు.

బెల్లపు ఊట ధ్వంసం

పెడన, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ సీఐ పి. వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దక్షిణతెలుగుపాలెంలోని నాటుసారా తయారీ స్థావరాలపై దాడి చేశారు. ఈ దాడిలో 850 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్సై ఎం.రామశేషయ్య, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు పాల్గొన్నారు.



నాటుసారా నిర్మూలనపై అవగాహన

పెడన రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నవోదయ-2 కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసులు కోటావానిపాలెంలో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదనపు ఎక్సైజ్ సూపరిండెంట్ భార్గవ నేతృత్వంలో గ్రామంలో పర్యటించారు. అక్రమ మద్యం తయారు, విక్రయం, తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. నాటుసారా లేని గ్రామంగా కోటావానిపాలెం గ్రామాన్ని తీర్చి దిద్దాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పి.వెంకటేశ్వరమ్మ, రామశేషయ్య, ప్రకాష్, సర్పంచి పరసా నరశింహరావు పాల్గొన్నారు.

పైడమ్మ ఆలయంలో భారీ అన్నసమారాధ

పెడన, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా పైడమ్మతల్లి దేవస్థానంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దేవస్థానం ఈవో టి.వివిఇ. మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డు ఆనందరావు, పత్తిపాటి జయకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, కోమట్ల సాంబశివరావు, గోకవరపు పద్మావతి, బొల్లా రామచంద్రరావు, కౌన్సిలర్ బళ్ల పర్యవేక్షించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలందించారు. ఎస్సైజి. సత్యనారాయణ తన సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు స్వయంగా సేవలందించారు.



పూర్వ విద్యార్థి కంప్యూటర్ వితరణ

పెడన, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, రిటైర్డు డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి సోమవారం రూ.40వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను బహుకరించారు. రాధాకృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ యర్రా నాగేంద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్జరీకి ఆర్థిక సాయం

పెడన, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డాబాపై నుంచి పడిపోయి తీవ్రంగా గాయపడిన కాటవరం పాఠశాల విద్యార్థిని ప్రవల్లిక సర్జరీ నిమిత్తం భట్ట జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్‌లో 1993 - 94 సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థులు, ఎన్ఆర్ఐ బండారు చైతన్య సౌజన్యంతో రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. ఇర్ఫాన్‌పాషా, ఉబేదుల్లా ఖాన్, కలాం, భవానీ పాల్గొన్నారు.




ఆర్గానిక్ కూరగాయలు విక్రయిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు

కలెక్టరేట్‌లో ఆర్గానిక్ కూరగాయల విక్రయం

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఎరువులు, పురుగు మందులు వాడని ఆర్గానిక్ కూరగాయలను ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో విక్రయించారు. రైతు సాధికారికత సంస్థ ఆధ్వర్యంలో బందరు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల రైతులు పురుగు మందులు, ఎరువులు వాడకుండా పండించిన కూరగాయాలు, ఆకుకూరలను కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె పార్థసారథి, నాగేశ్వరరావు ఉద్యోగులకు విక్రయించే ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులుకూరగాయల కొనుగోలుకు ఎక్కువ మక్కువ చూపారు.

ఆలయం పునర్నిర్మాణానికి రూ.1.08 లక్షల విరాళం



గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కప్పలదొడ్డి గ్రామంలోని పురాతనమైన సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి పేరిశెట్టి మణికంఠ గోపీకృష్ణ రూ. లక్షా 8వేలు చెక్కు ఆలయ కమిటీ సభ్యుడు అందే వెంకయ్యనాయుడుకు సోమవారం అందజేశారు. గోపీకృష్ణ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు పేరిశెట్టి మధుసూదనరావు, కుర్మా వెంకటేశ్వరరావు, కట్టా కోటేశ్వరరావు, పేరిశెట్టి నాగరవి, మేడక కోటనాగేంద్రం పాల్గొన్నారు. ఆలయ పునః నిర్మాణానికి సహకరించిన ట్రస్టుకు అభినందనలు తెలిపారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : శంకరమఠంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిగా బి.అరుణకు మిక్సీ ద్వితీయ బహుమతిగా స్వప్నకు కుక్కర్, తృతీయ బహుమతిగా సుప్రియకు హాట్‌బాక్స్ అందజేశారు. శ్రీదేవి, ఆర్. షామిలి, ఏ. సంగీత, తమ్మన మధుసూదన ప్రసాద్, శిరీష తమ్మన నాగసత్యప్రసాద్, హిమధర, ఎన్. భాస్కర్, వాసవీ, యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, టి. రంగనాయకులు, జల్లూరి దివ్యశ్రీ, తమ్మన అనూరాధ తదితరులు పాల్గొన్నారు.